క్లుప్తంగా

సీఎం జగన్‌కు ఆహ్వానం



సీఎం జగన్‌కు శుభలేఖ అందజేస్తున్న గిరజాల బాబు దంపతులు

కడియం: వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి గిరజాల వీర్రాజు (బాబు), ఆర్యాపురం అర్బన్ బ్యాంకు చైర్‌పర్సన్ రామకృష్ణ తులసి దంపతుల కుమార్తె కుసుమ వివాహానికి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని ఆహ్వానించారు. ఈ మేరకు సీఎంను కలసిన గిరజాల దంపతులు శుభలేఖతో పాటు, ధాన్యపు గింజలతో తయారు చేసిన కళాత్మక చిత్రపటాన్ని అందజేశారు. వారి వెంట బాబు సోదరుడు వెంకన్న బాబు తదితరులు ఉన్నారు.

వైఎస్సార్ సీపీకే ప్రజల మద్దతు

పార్టీ రూరల్ కోఆర్డినేటర్ నాగేశ్వర్



రాజమహేంద్రవరం రూరల్: రాష్ట్రంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభంజనాన్ని ఎవరూ అడ్డుకోలేరని వైఎస్సార్ సీపీ రూరల్ కోఆర్డినేటర్ చందన నాగేశ్వర్ శుక్రవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. టీడీపీ నేత నారా లోకేష్‌తో పాటు ఎంతమంది పాదయాత్రలు చేసినా రాబోయే ఎన్నికల్లో ప్రజలు సీఎం జగన్‌కు పట్టంకట్టేందుకు సిద్ధంగా ఉన్నారన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీలను 99 శాతం అమలు చేసిన ఏకైక ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి అన్నారు. పార్టీలు, కులాలు, మతాలకు అతీతంగా అర్హులందరికీ ఇంటి వద్దకే పథకాలు అందుతున్నాయని అన్నారు. సీఎం జగన్‌కు వస్తున్న ప్రజాదరణ చూసి ఓర్వలేని చంద్రబాబు దత్తపుత్రుడు పవన్‌కళ్యాణ్‌తో జతకట్టి అధికారాన్ని చేజిక్కించుకోవాలని పగటి కలలు కంటున్నారన్నారు. గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమంలో ఇంటింటికీ వెళుతున్నప్పుడు ప్రజలు ప్రభుత్వంపై చూపిస్తున్న ఆదరణ మరువలేనిదన్నారు. గ్రామాల్లో ప్రతి సమస్యను విడతల వారీగా పరిష్కరిస్తామన్నారు. రాబోయే ఎన్నికల్లో రూరల్ నియోజకవర్గంలో వైఎస్సార్ సీపీ విజయం సాధిస్తుందని చందన అన్నారు.

అక్రమ మద్యం స్వాధీనం

కంబాలచెరువు (రాజమహేంద్రవరం): అక్రమంగా మద్యం సీసాలు కలిగిఉన్న వ్యక్తిని రెండో పట్టణ పోలీసులు శుక్రవారం అరెస్టు చేశారు. స్థానిక బొగ్గులదిబ్బ ప్రాంతానికి చెందిన గండిబోయిన పైడిరాజు అనధికారంగా మద్యం విక్రయిస్తున్నాడు. వేరే ప్రాంతం నుంచి మద్యాన్ని తీసుకొచ్చి అధిక ధరలకు అమ్ముతున్నాడు. ముందస్తు సమాచారం మేరకు సీఐ గణేష్ తన బృందంతో అతని ఇంటిపై దాడి చేశారు. అక్కడ 59 మద్యం సీసాలు స్వాధీనం చేసుకున్నారు. వీటి విలువ రూ.8 వేలు ఉంటుందని సీఐ తెలిపారు. తమ పరిధిలో అసాంఘిక కార్యకలాపాలు సాగిస్తున్న వారిపై దృష్టి సారించామని అన్నారు. ఎవరైనా ప్రజలకు ఇబ్బందులు కలిగే విధంగా ప్రవర్తిస్తే చర్యలు తప్పవన్నారు.

బ్యాంకు ఉద్యోగుల సమ్మె విరమణ



సమావేశంలో మాట్లాడుతున్న లక్ష్మీపతిరావు

రాజమహేంద్రవరం సిటీ: దేశవ్యాప్తంగా బ్యాంకు ఉద్యోగులు ఈ నెల 30, 31 తేదీలలో తలపెట్టిన సమ్మె విరమించినట్లు యూఎఫ్‌బీఐ నాయకుడు లక్ష్మీపతిరావు ప్రకటించారు. శుక్రవారం నందం గనిరాజు జంక్షన్‌లో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యూనియన్ మేనేజ్‌మెంట్ సెంట్రల్ లేబర్ కమిషనర్ ఏర్పాటు చేసిన సమావేశంలో సమస్యలు పరిష్కరించడానికి అవగాహనకు వచ్చినందున సమ్మె విరమించినట్లు ప్రకటించారు. యూనియన్ నాయకులు శ్రీనివాస్, ప్రసాద్, చంద్రశేఖర్, రమేష్, రాంబాబు, మురళీ తదితరులు పాల్గొన్నారు.

బస్సు యాత్ర విజయవంతం చేయండి

కంబాలచెరువు: ఏపీకి ప్రత్యేక హోదా, విభజన హామీల సాధన కోసం విద్యార్థి, యువజన సంఘాల చేపట్టిన బస్సు యాత్రను విజయవంతం చేయాలని పీడీఎస్‌యూ, ఎస్ఎఫ్ఐ, ఏఎస్ఎఫ్ఐ, టీఎన్ఎస్ఎఫ్, డీవైఈఎఫ్ సంఘాలు కోరాయి. స్థానిక ప్రజాసంఘాల కార్యాలయం వద్ద శుక్రవారం సదస్సు నిర్వహించారు. ఆ సంఘ నాయకులు మాట్లాడుతూ నరేంద్ర మోదీ ఎన్నికల ప్రచారంలో సంవత్సరానికి 2 కోట్ల ఉద్యోగాలు ఇస్తామని చెప్పి విస్మరించారన్నారు. భావితరాల భవిష్యత్తు కోసం విద్యార్థి, యువజన, నిరుద్యోగ యువకులంతా చేస్తున్న బస్సు యాత్ర ఈ నెల 31న రాజమహేంద్రవరం చేరుకుంటుందన్నారు. పీడీఎస్‌యూ జిల్లా కార్యదర్శి ఎస్.కిరణ్‌కుమార్, ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి ఎన్‌రాజా, ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు సీహెచ్ సునీల్, డీవైఈఎఫ్ నాయకుడు టి.రాజేష్, తారకేశ్ పాల్గొన్నారు.

రథ సప్తమి వేడుకలకు వేళాయె..

- నేడు ప్రత్యేక పూజలకు ఏర్పాట్లు
- బొమ్మూరులో ముస్తాబైన సూర్యమందిరం



బొమ్మూరులో సూర్యనారాయణ స్వామివారు



భక్తుల కోసం ఏర్పాటు చేసిన బారికేడ్లు

రాజమహేంద్రవరం రూరల్: రథ సప్తమి వేడుకలకు వేళయ్యింది.. ఈ పూజలకు ఆలయాలు ముస్తాబయ్యాయి. రాజమహేంద్రవరం రూరల్, నగరంలోని ఆలయాల్లో శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించనున్నారు. బొమ్మూరు గ్రామంలోని వివేకానంద మహారోగి ఆరోగ్య కేంద్రంలో వేంచేసి ఉన్న సూర్యమందిరంలో శనివారం రథ సప్తమి వేడుకలు, సూర్యనారాయణమూర్తి జయంతిని వైభవంగా నిర్వహించనున్నారు. బొమ్మూరుకు చెందిన రాయుడు చిట్టిబాబు, హేమశ్రీ దంపతులు పీటలపై కూర్చుని స్వామివారికి గణపతి పూజ, పుణ్యాహవచనం, నవగ్రహ ఆరాధన, సూర్యహోమం, సూర్యనమస్కారాలు, సూర్యనారాయణ స్వామి కల్యాణం (శాంతి కల్యాణం) జరుపుతారు. జ్యోతిర్లింగార్చనతో రథసప్తమి వేడుకలు ముగుస్తాయి. ఆలయ అర్చకులు సుబ్రహ్మణ్యశర్మ నేతృత్వంలో టీటీడీ వార్షిక సత్కార పండిట్ ప్రతిష్టాచార్య బ్రహ్మశ్రీ కాళ్లకూరి సూర్యశ్రీ ఆధ్వర్యంలో విల్లూరి సూర్యనారాయణశర్మ, కాళ్లకూరి శ్రీరామశర్మ అర్చక బృందం బ్రహ్మత్వం నిర్వహించనున్నారు. 1998లో ఈ సూర్యదేవాలయం నిర్మించారు. చిన్నజీయర్ స్వామీజీచే ప్రతిష్ఠించిన ఈ దేవాలయంలో ప్రతి రథసప్తమి వేడుకలకు బొమ్మూరుతో పాటు పరిసర గ్రామాల నుంచి వేలాదిగా భక్తులు తరలివస్తుంటారు. భారతమాత వారి ఇలవేల్పు వివేకానంద గోనిలయం పేరున 30 గోవులతో గోశాల సైతం నిర్వహిస్తున్నారు. ఇదిలా ఉంటే శుక్రవారం సూర్యనారాయణ స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ అర్చకుడు కాళ్లకూరి సుబ్రహ్మణ్యశర్మ ఆధ్వర్యంలో గణపతిపూజ, పుణ్యాహవచనం, సూర్యనారాయణ స్వామివారికి 121 సుగంధ ద్రవ్యాలతో అభిషేకం చేశారు. పూజల్లో అధిక సంఖ్యలో దంపతులు పాల్గొన్నారు.

ఇబ్బంది రాకుండా..

సూర్యమందిరంలో రథసప్తమి వేడుకలకు వచ్చే భక్తులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా ఆరోగ్య కేంద్రం కమిటీ అధ్యక్షుడు రిమ్మలపూడి సుబ్బరాజు, కమిటీ సభ్యులు ఆధ్వర్యంలో అన్ని ఏర్పాట్లు చేశారు. భక్తులు క్యూలో వచ్చేందుకు బారికేడ్లు పెట్టారు. దూర ప్రాంతాల నుంచి వేలాది మంది భక్తులు రానుండడంతో ఎటువంటి అసౌకర్యం లేకుండా చర్యలు చేపట్టినట్లు నిర్వాహకులు తెలిపారు.

వైఎస్సార్ సీపీ మరింత బలోపేతానికి కృషి



అడపా శ్రీహరి

రాజమహేంద్రవరం సిటీ: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నేతృత్వంలో నగరంలో వైఎస్సార్ సీపీని మరింత బలోపేతం చేసేందుకు అవసరమైన ప్రక్షాళనలు, ప్రణాళికలు చేపట్టినట్లు పార్టీ నగర అధ్యక్షుడు అడపా శ్రీహరి ప్రకటించారు. స్థానికంగా ఆయన విలేకరులతో మాట్లాడుతూ పేదల సంక్షేమానికి పెద్దపీట వేస్తున్న జగనన్న ప్రభుత్వానికి, ఎంపీ భరత్ రామ్ నాయకత్వానికి ప్రజలు జేజేలు పలుకుతున్నారన్నారు. పార్టీ ఉభయగోదావరి జిల్లాల రీజినల్ కోఆర్డినేటర్లు, ఎంపీలు పెద్దిరెడ్డి మిథున్‌రెడ్డి, పిల్లి సుభాష్‌చంద్రబోస్, ఎంపీ మార్గాని భరత్‌రామ్ నేతృత్వంలో వైఎస్సార్ సీపీని నగరంలో మరింత బలోపేతం చేస్తామన్నారు. రానున్న నగరపాలక సంస్థ, శాసనసభ ఎన్నికల్లో ఘన విజయం సాధించడమే లక్ష్యంగా డివిజన్ స్థాయి నాయకత్వాన్ని పెంచే విధంగా డివిజన్ ఇన్‌చార్జుల నియామకం చేపట్టనున్నట్లు ప్రకటించారు. త్వరలో నగరంలోని అన్ని దేవాలయాల కమిటీల నియామకాలను ప్రకటిస్తామన్నారు.

రక్త గ్రూపు నిర్ధారణ పరీక్షలు

కంబాలచెరువు: స్థానిక కందుకూరి రాజ్యలక్ష్మి ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో రక్త గ్రూపు నిర్ధారణ పరీక్షలు శుక్రవారం నిర్వహించారు. కళాశాలలో జంతుశాఖ విభాగం ఆధ్వర్యంలో ఈ పరీక్షలు చేశారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ పి.రాఘవకుమారి, జంతుశాస్త్ర విభాగాధిపతి సీహెచ్ ప్రియాంక, అధ్యాపకులు జి.దివ్యశ్రీ, డాక్టర్ పీఎస్‌హెచ్‌పీ దీపికారాణి పాల్గొన్నారు.

30 నుంచి వేంకటేశ్వరుని బ్రహ్మోత్సవాలు



దుళ్లలో వేంకటేశ్వరస్వామివారు

కడియం: దుళ్లలోని శ్రీభూ సమేత వేంకటేశ్వర స్వామివారి వార్షిక బ్రహ్మోత్సవాలు 30వ తేదీ నుంచి ప్రారంభం కానున్నాయి. ఐదు రోజుల పాటు కనుల పండువగా ఉత్సవాలు నిర్వహించనున్నారు. లక్ష్మీ, సుదర్శన హోమాలు చేసేందుకు ప్రత్యేక యాగశాల నిర్మించారు. ఉత్సవాల కోసం ఆలయాన్ని పుష్పాలతో అలంకరిస్తున్నారు. భారీ ఎత్తున హాజరయ్యే భక్తులకు ఇబ్బందులు కలగకుండా ఏర్పాట్లు చేస్తున్నారు. 30న స్వామివారికి ప్రత్యేక వాహనాలపై గ్రామోత్సవం నిర్వహిస్తారు. రాత్రి 8 గంటలకు ప్రారంభమయ్యే ఈ ఉత్సవం 12 గంటల వరకూ కొనసాగుతుంది. భక్తులే స్వయంగా స్వామివారి వాహనాన్ని మోస్తారు. ఇందుకోసం అవసరమైన వాహనాలను రాజమహేంద్రవరం, యానాంలోని ఆలయాల నుంచి తీసుకువస్తారు. స్వామివారి ఉత్సవ విగ్రహాన్ని నిలిపిన రథం ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తుంది. ఏటా ఉత్సవాల్లో స్వామి సేవల్లో పాలుపంచుకునేందుకు భక్తులు గోవిందమాలలు ధరిస్తారు. 30వ తేదీ మాలలు ధరించి, దీక్షను స్వీకరిస్తారు. రోజూ జరిగే పూజల్లో వీరు సేవలు అందిస్తారు. బ్రహ్మోత్సవాలు పూర్తయిన తరువాత దీక్షలను విరమిస్తారు. 31న శేష వాహన సేవ జరుగుతుందని ఆలయ అనువంశిక ధర్మకర్త శ్రీనివాసరావు, అర్చకుడు పెద్దింటి లక్ష్మణాచార్యులు తెలిపారు. ఫిబ్రవరి 1న గరుడ వాహన సేవ, 2న ఉదయం 9 గంటలకు అన్నకూటోత్సవం, రాత్రి 8 గంటలకు హనుమంత వాహన సేవ జరుగుతాయన్నారు. 3న లక్ష్మీహోమం, సదస్యం, గజవాహన సేవ, 4న సుదర్శన హోమం, పుష్పక వాహన సేవ ఉంటాయన్నారు. 5న ఉదయం 10 గంటలకు చక్రస్నానం, రాత్రి ఏడు గంటలకు శ్రీపుష్పయాగం నిర్వహిస్తారని వివరించారు.

సీఎం జగన్‌తో ప్రతి ఇంటా సంక్షేమం

- రూరల్ కోఆర్డినేటర్ చందన నాగేశ్వర్
- చైతన్యనగర్‌లో గడప గడపకూ మన ప్రభుత్వం



ప్రజలకు పథకాల గురించి వివరిస్తున్న రూరల్ కోఆర్డినేటర్ చందన నాగేశ్వర్

కడియం: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో రాష్ట్రంలోని ప్రతి ఇంటా సంక్షేమ కాంతులు విరజిల్లుతున్నాయని వైఎస్సార్ సీపీ రూరల్ కోఆర్డినేటర్ చందన నాగేశ్వర్ అన్నారు. మాధవరాయుడుపాలెం పంచాయతీ పరిధి చైతన్యనగర్ కాలనీలో శుక్రవారం గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమాన్ని చందన నిర్వహించారు. ఈ సందర్భంగా పార్టీ నాయకులు, అధికారులతో కలిసి ప్రతి ఇంటికీ వెళ్లి సంక్షేమ పథకాల గురించి వివరించారు. అక్కడి ప్రజల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ప్రతి సమస్యను పరిష్కరించాలని ఆయా శాఖల అధికారులను ఆయన ఆదేశించారు. ఈ సందర్భంగా నాగేశ్వర్ మాట్లాడుతూ నవరత్న పథకాల ద్వారా పేదలకు మేలు జరుగుతుందన్నారు. ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలతో ప్రజల్లో సంతోషం నెలకొందన్నారు. అందరి సంక్షేమమే అజెండాగా సీఎం జగన్ పాలన సాగుతుందని అన్నారు. కార్యక్రమంలో శాప్ డైరెక్టర్ భీమిరెడ్డి నాగేంద్ర, మండల వ్యవసాయ సలహా మండలి చైర్మన్ ఈలి గోపాలం, మండల బూత్ కమిటీ కన్వీనర్ తాడాల విష్ణుచక్రవర్తి, నాయకులు సంగిత వెంకటేశ్వరరావు, రాణా హరిశ్చంద్ర, పి.లోవరాజు, కె.సత్తిబాబు, హనుమంతు తదితరులు పాల్గొన్నారు.

ప్రతి గ్రామాన్ని సుందరంగా తీర్చిదిద్దాలి



నోడల్ అధికారి పద్మజను అభినందిస్తున్న జిల్లా పంచాయతీ అధికారి జగదాంబ

ఆల్కాట్‌తోట (రాజమహేంద్రవరం రూరల్): జగనన్న స్వచ్ఛ సంకల్పం కార్యక్రమాన్ని ప్రతిష్టాత్మకంగా అమలు చేసి ప్రతి గ్రామాన్ని సుందరంగా తీర్చిదిద్దాలని జిల్లా పంచాయతీ అధికారి పి.జగదాంబ ఆదేశించారు. శుక్రవారం స్థానిక సబ్ కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో ఆమె అధ్యక్షతన రాజమహేంద్రవరం డివిజనల్ పంచాయతీ కార్యదర్శుల సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గ్రామ, జిల్లా స్థాయిలో ఉన్న కోర్టు కేసులపై పంచాయతీ కార్యదర్శులు సత్వరమే చర్యలు తీసుకోవాలన్నారు. జగనన్న స్వచ్ఛ సంకల్ప (జేఎస్ఎస్) పథకంలో అమలు చేయాల్సిన కార్యక్రమాలను 100 శాతం పూర్తి చేయాలన్నారు. ఇప్పటికే మొదలు పెట్టిన ఇంటి పన్నుల వసూళ్లు నెలాఖరు నాటికి 70 శాతం, ఫిబ్రవరి 15వ తేదీకి 100 శాతం పూర్తి చేయాలని ఆదేశించారు. స్పందనలో వచ్చిన ఫిర్యాదులను నిర్ణీత సమయంలో పరిష్కరించాలన్నారు. స్వామిత్వ (జగనన్న భూ హక్కు మరియు భూ రక్ష పథకం)లో ఎంపిక చేసిన గ్రామాలలో సర్వేను నిర్ణీత గడువు లోగా పూర్తి చేయడం, ప్లాస్టిక్ వినియోగం పూర్తిగా నిషేధించడానికి ప్రభుత్వం నిర్దేశించిన ప్రణాళికలను పూర్తి స్థాయిలో అమలు చేయాలన్నారు. గణతంత్ర దినోత్సవంలో కలెక్టర్ చేతుల మీదుగా ప్రశంసాపత్రాలు అందుకున్న అధికారులు, సిబ్బందిని జగదాంబ అభినందించారు. డివిజనల్ పంచాయతీ అధికారి జానా సత్యనారాయణ, స్వామిత్వ నోడల్ అధికారి కేవీఆర్ఎల్ పద్మజ, జేఎస్ఎస్ జిల్లా కోఆర్డినేటర్ ఆర్మ్‌స్ట్రాంగ్ తదితరులు పాల్గొన్నారు.

28 నుంచి చందన యాత్ర మహోత్సవాలు



ఉత్సవాల కరపత్రాన్ని ఆవిష్కరిస్తున్న ఆలయ నిర్వాహకులు

సీటీఆర్ఐ: కోరుకొండ రోడ్డులోని సింహాచలనగర్ శ్రీవరహాలక్ష్మీ నృసింహస్వామి క్షేత్రంలో శ్రీమదుభయ వేదాంతాచార్య పీఠం ట్రస్టు, శ్రీరంగం ఆధ్వర్యాన ఈ నెల 28 నుంచి ఫిబ్రవరి 2వ తేదీ వరకూ వార్షిక చందన యాత్ర మహోత్సవాలు నిర్వహించనున్నారు. ఈ మేరకు ఆలయ ధర్మకర్తలు కాలెపు సూర్యసింహాచలం, కాలెపు నాగేశ్వరరావు, కుటుంబ సభ్యులతో కలసి ఆలయ ప్రాంగణంలో శుక్రవారం విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా అర్చకుడు అవసరాల శ్రీకిరణ్‌స్వామి మాట్లాడుతూ శనివారం సాయంత్రం 6 గంటలకు ఉత్సవ ప్రార్థన, పుణ్యాహవచనం, వైనతేయ ప్రతిష్ఠ జరుగుతాయన్నారు. 29న సాయంత్రం 4 గంటలకు తిరువీధి ఉత్సవం ఉంటుందన్నారు. ముప్పిరాల అనంతాచార్యులు, పరాశర రఘునాథ భట్టర్ స్వామి ఆధ్వర్యంలో ఆలయం నుంచి మొదలై, కంబాలచెరువు, దేవీచౌక్, కోటగుమ్మం, మెయిన్ రోడ్డు, జాంపేట మీదుగా సుమారు 11 కిలోమీటర్ల మేర ఊరేగింపు సాగి, తిరిగి ఆలయానికి చేరుతుందన్నారు. 30న ఉదయం ఆరాధన, హోమాలు, సాయంత్రం ఎదురు సన్నాహం, తిరుకల్యాణ మహోత్సవం, మూర్తి కలశారాధన నిర్వహిస్తారు. 31న సువర్ణ పుష్పార్చన, నిజరూప దర్శన సేవ, ఫిబ్రవరి 1న ఆరాధన హోమాలు, చందన రూపంతో నిత్యరూప దర్శనం, సాయంత్రం శ్రీవారి చక్రస్నానం ఉంటాయన్నారు. 2న అన్న సమారాధన, సాయంత్రం పుష్పయాగం, ద్వాదశ ఆరాధనలు, మహా పూర్ణాహుతితో ఉత్సవాలు ముగుస్తాయన్నారు. సమావేశంలో అర్చకులు చిరంజీవిస్వామి, ఉమాశంకర్ స్వామి తదితరులు పాల్గొన్నారు.

వెయిట్ లిఫ్టింగ్‌లో అత్యుత్తమ ప్రతిభ



వెయిట్ లిఫ్టింగ్ పోటీల్లో బంగారు పతకాలు సాధించిన తరంగిణి, హేమశ్రీలను సత్కరిస్తున్న నాయకులు

ఆల్కాట్‌తోట (రాజమహేంద్రవరం రూరల్): రాజమహేంద్రవరం నగరపాలక సంస్థలో సొసైటీ వర్కర్స్‌గా పనిచేస్తున్న కారింగి సత్యనారాయణ, కృపావతి దంపతుల కుమార్తెలు చెందిన కారింగి తరంగిణి, కారింగి హేమశ్రీలు రాష్ట్ర స్థాయి వెయిట్ లిఫ్టింగ్ పోటీల్లో అత్యుత్తమ ప్రతిభ కనబరిచి స్వర్ణ పతకాలు సాధించారు. ఈ మేరకు శుక్రవారం స్థానిక బాలాజీపేట వార్డు సచివాలయంలో నగరపాలక సంస్థ ఎస్సీ, ఎస్టీ ఎంప్లాయిస్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు కోరుకొండ మురళీ ఆధ్వర్యంలో కోచ్ యాళ్ల భాస్కరరావుతో పాటు తరంగిణి, హేమశ్రీలను దుశ్శాలువా, జ్ఞాపికలతో సత్కరించారు. కోచ్ యాళ్ల భాస్కరరావు మాట్లాడుతూ 1980 నుంచి వెయిట్ లిఫ్టింగ్‌లో తర్ఫీదు ఇస్తున్నానని, ఇప్పటివరకు చాలా మంది తన వద్ద శిక్షణ పొంది ఎయిర్‌ఫోర్స్, ఆర్మీతో పాటు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల్లో ఉన్నత స్థాయిలో ఉన్నారన్నారు. అయితే అమ్మాయిలకు శిక్షణ ఇవ్వడం ఇదే తొలిసారని, కుటుంబ సభ్యుల ప్రోత్సాహంతో వారు ఏ పోటీలకు వెళ్లినా గోల్డ్ మెడల్స్ సాధిస్తున్నారన్నారు. వారు కామన్‌వెల్త్ క్రీడల్లో పాల్గొని బంగారు పతకాలు సాధించాలన్నదే తన ఆకాంక్ష అన్నారు. 10వ తరగతి పాసైన తరువాత వారిద్దరినీ ఆర్మీ హాస్టల్‌కు పంపుతామని, వారు అక్కడ ఇచ్చిన శిక్షణతో జాతీయ స్థాయిలో పతకాలు సాధించడం ఖాయమన్నారు. ఇప్పుడు జరిగిన సీఎం కప్, శాప్ పోటీల్లో వారు బంగారు పతకాలతో పాటు కప్, మెడల్స్ సాధించడం గర్వకారణంగా ఉందన్నారు. ఎస్సీ, ఎస్టీ ఉద్యోగ సంఘాల నాయకులు తాళ్లూరి బాబూ రాజేంద్రప్రసాద్, కోరుకొండ చిరంజీవి, ఎంఆర్‌పీఎస్ రాష్ట్ర నాయకులు వైరాల అప్పారావు, పాము బాబూరావు, కార్పొరేషన్ ఎస్సీ, ఎస్టీ ఎంప్లాయిస్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు తరపట్ల సురేష్, యేసుదానం, అద్దాల కుమార్‌బాబు తదితరులు వారికి పూలమాలలు వేసి అభినందించారు. కార్యక్రమంలో 40, 41 సచివాలయ సిబ్బంది, స్థానిక పెద్దలు పాల్గొన్నారు.

వైభవంగా వేంకటేశ్వరుని తిరుకల్యాణం



శ్రీలక్ష్మీ పద్మావతి సమేత వేంకటేశ్వర స్వామివారికి కల్యాణం జరిపిస్తున్న దంపతులు

రాజమహేంద్రవరం రూరల్: బొమ్మూరు వెంకటగిరి కొండపై వేంచేసియున్న వేంకటేశ్వరస్వామి ఆలయంలో శుక్రవారం లక్ష్మీ పద్మావతి సమేత వేంకటేశ్వరస్వామివారి 23వ తిరుకల్యాణ మహోత్సవం అత్యంత వైభవంగా జరిగింది. బ్రహ్మశ్రీ తిరుమల తిరుపతి దేవస్థాన వార్షిక సత్కార పండితులు ప్రతిష్టాచార్య ఉపన్యాసవాచస్పతి, శైవాగమ పండితుడు కాళ్లకూరి సూర్యశ్రీ ఆధ్వర్యంలో ప్రధాన అర్చకుడు నండూరి శ్రీకృష్ణపరమాత్మ పర్యవేక్షణలో శ్రీస్వామివారి కల్యాణాన్ని సుంకర వెంకట నరసింహస్వామి, అరుణ దంపతులచే జరిపించారు. ఉదయం విఘ్నేశ్వర పూజ, తిరుమంజనం, అనంతరం ప్రత్యేక అలంకరణ దర్శనం, అగ్ని ప్రతిష్ఠాపన, మధ్యాహ్నం లక్షతులసి పూజ, సాయంత్ర పూర్ణాహుతి, నీరాజన మంత్రపుష్పాలు జరిగాయి. భారీ అన్నసమారాధన నిర్వహించారు. కోలాట నృత్య ప్రదర్శనలు అలరించాయి. ఆలయ వంశపారంపర్య ధర్మకర్త కామిని వెంకటరామప్రసాద్ చౌదరి ఏర్పాట్లు పర్యవేక్షించారు.

కార్మికులు ఐక్యంగా ముందుకు సాగాలి



సమావేశంలో పాల్గొన్న రామకృష్ణ తదితరులు

సీటీఆర్ఐ: కార్మికులు ఐక్యంగా ముందుకు సాగాలని గోదావరి ఎలక్ట్రికల్ వర్కర్స్ ట్రేడ్ యూనియన్ అధ్యక్షుడు బొజ్జ రామకృష్ణ కోరారు. స్థానిక విక్రమ్ హాల్‌లో శుక్రవారం యూనియన్ ఆధ్వర్యంలో ఎలక్ట్రీషియన్ డే జరిగింది. అనంతరం యూనియన్ నాలుగో వార్షికోత్సవాన్ని నిర్వహించారు. యూనియన్ గౌరవ అధ్యక్షుడు యడ్ల సూర్యచంద్రరావు మాట్లాడుతూ కార్మికుల భద్రత దృష్ట్యా ప్రతి ఒక్కరూ బీటీసీ వర్కర్స్ రిజిస్ట్రేషన్, ఈ శ్రమ కార్డును తప్పనిసరిగా తీసుకోవాలని కోరారు. యూనియన్‌ను పటిష్ట పరుస్తున్న రామకృష్ణను పలువురు అభినందించారు. సంక్షేమ కార్మిక అధికారులు లలితాకుమారి, విజయ్‌ప్రకాష్, వంశీ తదితరులు కార్మికుల భద్రతకు బీమా, ఇతర సంక్షేమ పథకాలను వివరించారు. కార్యక్రమంలో సయ్యద్ అజ్మతుల్లా, రఘు, సూర్యచంద్రరావు, గంగాచార్యులు పాల్గొన్నారు.

నిత్య యోగాతో క్రమశిక్షణ



విద్యార్థులతో యోగాసనాలు వేయిస్తున్న శిక్షకులు

రాజమహేంద్రవరం సిటీ: నిత్యం యోగా సాధన చేయడం ద్వారా క్రమశిక్షణ అలవడుతుందని మున్సిపల్ కమిషనర్ కె.దినేష్‌కుమార్ అన్నారు. శుక్రవారం నగర పాలక సంస్థ ఆధ్వర్యంలో స్థానిక ఆర్ట్స్ కళాశాల మైదానంలో మహా సూర్యయజ్ఞం 2023 నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చిన్నప్పటి నుంచి పిల్లలకు యోగా, సూర్య నమస్కారాలు అలవాటు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ స్కూల్స్ విద్యార్థులు 5 వేల మంది పాల్గొన్నారన్నారు. ప్రముఖ మానసిక వైద్య నిపుణుడు కర్రి రామారెడ్డి మాట్లాడుతూ పతంజలి శ్రీనివాస్ ఆధ్వర్యంలో చేపట్టిన ఈ కార్యక్రమం అద్భుతమైందన్నారు. భవిష్యత్‌లో ఆయన సేవలు అందరికీ ఉపయోగపడేలా చర్యలు చేపట్టాలన్నారు. స్వామి వినిశ్చలానంద, ఏడీసీ సత్యవేణి, తోట సూర్యారావు, రాజ్‌కుమార్, వాసిరెడ్డి బింధు, శ్రీనివాస్, విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు.

రూ.1.24 లక్షలు స్వాహా

రాజమహేంద్రవరం రూరల్: ఎస్‌బీఐ యోనో యాప్ అప్‌డేట్ చేసుకోవాలంటూ తన బ్యాంకు ఖాతా నుంచి రూ.1.24 లక్షలు స్వాహా చేశారని మీఎల్‌పురానికి చెందిన షేక్ మదీనామన్సూర్ శుక్రవారం బొమ్మూరు పోలీసులకు ఫిర్యాదు చేశారు. మదీనా మన్సూర్‌కు గత ఏడాది నవంబరు 23న ఒక వ్యక్తి ఫోన్‌చేసి ఎస్‌బీఐ యోనోయాప్ అప్‌డేట్ చేయించుకోవాలని లేకపోతే బ్యాంకు ఖాతా నిలిచిపోతుందని నమ్మించాడు. పాన్‌కార్డు, ఓటీపీ వివరాలు అడుగగా మన్సూర్ అన్నీ చెప్పడంతో బ్యాంకు ఖాతాలోని రూ.1.24 లక్షలు స్వాహా చేశాడు.

పొదుపు పథకాలపై వడ్డీ రేట్ల పెంపు

ప్రకాశంనగర్: పోస్టల్ పొదుపు పథకాలపై కేంద్ర ప్రభుత్వం వడ్డీ రేట్లు పెంచిందని, దీనిపై ప్రజలకు అవగాహన కల్పిస్తున్నట్లు పోస్టల్ సూపరింటెండెంట్ పి.కోమల్ కుమార్ శుక్రవారం పేర్కొన్నారు. గతంలో 6.70 వడ్డీ శాతం ఉన్న పోస్టల్ మంత్లీ ఇన్‌కమ్ స్కీమ్ 7.1 శాతానికి, 5.50 శాతమున్న సంవత్సరం పోస్టాఫీస్ టైం డిపాజిట్ వడ్డీని 6.6 శాతం వరకు, 5.70 శాతం ఉన్న రెండేళ్ల పోస్టాఫీస్ టైం డిపాజిట్ వడ్డీని 6.8 శాతానికి పెంచారన్నారు. 5.80 శాతం ఉన్న మూడేళ్ల పోస్టాఫీస్ టైం డిపాజిట్ వడ్డీని 6.9 శాతానికి, 6.70 శాతం వడ్డీ ఉన్న ఐదేళ్ల టైం డిపాజిట్ వడ్డీని 7.0 శాతానికి పెంచినట్లు చెప్పారు. కిసాన్ వికాస్ పత్ర మెర్చురిటీ గతంలో 123 నెలలు ఉండగా 120 నెలలకు కుదించారని, 6.80 శాతం ఉన్న నేషనల్ సేవింగ్స్ సర్టిఫికెట్ వడ్డీని 7.0 శాతానికి, సీనియర్ సిటిజన్స్ సేవింగ్ స్కీమ్ వడ్డీ గతంలో 7.60 శాతం ఉండగా ప్రస్తుతం 8.0 శాతానికి పెంచినట్లు వివరించారు.